సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

రాస పోలమాంబకు ప్రత్యేక అలంకరణ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస గ్రామ దేవత రాస పోలమాంబ అమ్మవారిని ఆలయ కమిటీ ప్రతినిధులు మంగళవారం రూపాయి కాసులతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ అలంకరణకు పంచాయతీకి చెందిన కాగితాల గోవింద, రాజేష్‌రెడ్డి, వెంకట రమణ, అప్పల సత్యం, నారాయణ, మజ్జి సురేష్, సాయి, చిల్ల గణేష్ సహకారం అందించారు.

16 నుంచి క్రిస్మస్ వేడుకలు

తగరపువలస: చిట్టివలస బంతాట మైదానంలో ఈ నెల 16, 17న కొండపేట జీవం గల దేవుని సంఘం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి ప్రారంభమయ్యే వేడుకల్లో ఆరాధన, ప్రార్థనలు, స్కిట్లు, చిన్నారుల డ్యాన్స్‌లు ఉంటాయని పాస్టర్ పి.ఎ.ఆంథోని తెలిపారు. వివరాలకు 90324 30888, 79977 88202లో సంప్రదించాలని కోరారు.

తైక్వాండో పోటీల్లో పతకాలు



పతకాలు పొందిన వారిని అభినందిస్తున్న కోచ్ యశోదరావు

కొమ్మాది: ఇటీవల డెహ్రాడూన్‌లో జరిగిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో కాపులుప్పాడకు చెందిన పలువురు విద్యార్థులు పతకాలు సాధించారు. అండర్ – 18 విభాగంలో ఇ.లిఖిత రజిత పతకం, అండర్ – 26 విభాగంలో శ్రీ ఇషిత బంగారు పతకం, అండర్ – 14 విభాగంలో శ్రీ విశాగ్ బంగారు పతకం సాధించినట్లు కాపులుప్పాడ న్యూ ఇండియా తైక్వాండో క్లబ్ నిర్వాహకులు యశోదరావు తెలిపారు. అదే విధంగా కాకినాడ జిల్లా సామర్లకోటలో విక్టరీ షోటోఖాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ కరాటే చాంపియన్‌షిప్‌లో బీచ్‌రోడ్డు మంగమారిపేటకు చెందిన వాసుపల్లి నివేదిత 7 సంవత్సరాల విభాగంలో బంగారు పతకం, పదేళ్ల విభాగంలో కారి రేష్మి బంగారు పతకం సాధించారు.

గ్రాఫిక్స్‌పై వర్క్‌షాప్ ప్రారంభం

తగరపువలస: చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో అయిదు రోజులపాటు జరగనున్న ఇంజినీరింగ్ గ్రాఫిక్స్‌పై వర్క్‌షాప్‌ను మంగళవారం డాక్టర్ బీవీఆర్ గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రాఫిక్స్ ప్రాముఖ్యత వివరించారు. ప్రతి ఇంజినీరింగ్ విద్యార్థి డ్రాయింగ్ నేర్చుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.మురళీకృష్ణ మాట్లాడుతూ డిజైన్ ప్రక్రియలో ఇంజినీర్లు, ఇతర నిపుణులకు ఆలోచనలు, సాంకేతిక సమాచారం తెలియజేయడానికి డ్రాయింగ్‌లు ఉపయోగపడతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో డ్రాయింగ్ షీట్లపై ప్రాక్టీస్ చేయించారు. వివిధ కళాశాలల నుంచి 300 మంది విద్యార్థులు పాల్గొనగా డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ ఎ.అర్జునరావు, కన్వీనర్ శ్రామిక లక్ష్మి, కో కన్వీనర్ జి.పట్నాయిక్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ జి.రాము, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల బకాయిలు చెల్లించాలి

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మికులకు యాజమాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ కార్మిక సంఘం అధ్యక్షుడు జీవీ కైలాసరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వివిధ సంఘాల నాయకులు మాట్లాడారు. ఇప్పటి వరకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవతో యాజమాన్యం కార్మికులకు రూ.34 కోట్ల చెల్లింపులు చేసిందన్నారు. మిగిలిన బకాయిలు చెల్లించకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. సమావేశంలో మునకాల ఆదినారాయణరెడ్డి, కొండపు ఈశ్వరరావు, దల్లి అప్పలరెడ్డి, సాడి అచ్చారావు, చిల్ల రాంపైడి, ఎస్.ఈశ్వరరావు, ఎం.దేవుళ్లు, జి.రమణ, సీహెచ్ ఈశ్వరరావు, వై.అప్పలరెడ్డి, నరవ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ చదువులు

భారతదేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుందని పెద్దలు చెప్పిన మాటను బలంగా నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు 'నాడు – నేడు' ద్వారా సమూలంగా మార్చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మాధ్యమం తీసుకురావడంతోపాటు, నాణ్యమైన విద్య అందించేందుకు పాఠ్య పుస్తకాలు, ఇంగ్లిష్ డిక్షనరీలు అందించారు. కొన్ని ప్రైవేటు పాఠశాలలకు కూడా సాధ్యం కాని ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ (ఐఎఫ్‌పీ బోర్డులు) ఏర్పాటు చేసి బోధిస్తున్నారు. టోఫెల్ పాఠాలు కూడా బోధిస్తున్నారు. ఇందుకు రాష్ట్రంలోనే పెద్దదైన చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలనే ఒక ఉదాహరణ. ఇదే పాఠశాలలో గతంలో పూర్తి స్థాయిలో తరగతి గదులు, బెంచీలు, గదుల్లో ఫ్యాన్‌లు, లైట్లు లేక వరండాల్లోనే కూర్చుని చదువుకోవాల్సి వచ్చేది. ఉపాధ్యాయులు పూర్తి స్థాయిలో లేక అరకొరగా బోధన సాగేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత డిజిటల్ ఐఎఫ్‌పీ ప్యానళ్లు అందుబాటులోకి తీసుకొచ్చారు. తరగతి గదుల్లో బెంచీలు, ఫ్యాన్‌లు, ట్యూబ్‌లైట్లు ఏర్పాటు చేసి, సుందరమైన ఫ్లోరింగ్‌తో తీర్చిదిద్దారు. ఈ హైస్కూల్‌కు ఒకేసారి 40 మంది ఉపాధ్యాయులను అదనంగా కేటాయించడంతో మొత్తం అధ్యాపకుల సంఖ్య 125కి చేరింది. ఒక చిన్న పాఠశాలలో పిల్లల సంఖ్య కంటే వీరు ఎక్కువ. అంటే ప్రభుత్వ పాఠశాలలో విద్యాభివృద్ధికి సీఎం జగన్ ఇస్తున్న ప్రాధాన్యాన్ని అర్థం చేసుకోవచ్చు.

– మధురవాడ



ఇది కదా అభివృద్ధి



తరగతి గదిలో డిజిటల్ బోర్డుపై పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

కార్పొరేట్‌కు దీటుగా చంద్రంపాలెం హైస్కూల్

52 తరగతి గదుల్లో ఐఎఫ్‌పీ ప్యానల్స్

ఒక్కొక్కటి రూ.**2** లక్షలు

మొత్తంగా రూ.**1.04** కోట్ల వ్యయం

కొత్తగా **40** మంది ఉపాధ్యాయుల కేటాయింపు

'నాడు – నేడు' నిధులు రూ.**3.6** కోట్లతో అభివృద్ధి పనులు

అందుబాటులోకి డిజిటల్ బోర్డులు

చంద్రంపాలెం హైస్కూల్‌లో 60 తరగతి గదులు ఉంటే 52 క్లాస్ రూమ్‌లకు డిజిటల్ బోర్డులు (ఐఎఫ్‌పీ) అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇంకో 10 బోర్డులకు నిధులు మంజూరయ్యాయి. అన్ని రకాల పరికరాలతో కలిపి ఒక్కో బోర్డుకు రూ.2 లక్షలు ఖర్చు అవుతుంది. మొత్తంగా ఈ ఒక్క పాఠశాలకే కోటి రూపాయల పైన ఖర్చు చేశారు.



చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్‌లో ఆర్‌వో ప్లాంట్

800 మందికి ట్యాబ్‌లు

కరోనా తర్వాత డిజిటల్ విద్యకు ఎంత ప్రాధాన్యత పెరిగిందో అందరికీ తెలిసిందే. అయినప్పటికీ ఆన్‌లైన్ పాఠాల కోసం చాలా మంది తల్లిదండ్రులు పిల్లలకు సెల్‌ఫోన్ కూడా ఇవ్వలేని పరిస్థితి. అలాంటిది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పిల్లలకు ట్యాబ్‌లే ఉచితంగా అందించారు. ఈ పాఠశాలలో 800 మందికి వీటిని అందజేశారు.



క్లాసులో డిజిటల్ పాఠాలు వింటున్న విద్యార్థులు

రెండు దశల్లో... రూ.3.6 కోట్ల ఖర్చు

చంద్రంపాలెం హైస్కూల్‌కు 'నాడు – నేడు' ద్వారా మొదటి దశలో రూ.1.20 కోట్లు, రెండో దశలో రూ.2.40 కోట్లు కలిపి మొత్తంగా రూ.3.60 కోట్లు నిధులు సీఎం జగన్‌మోహన్ రెడ్డి మంజూరు చేశారు. వీటితో ఈ పాఠశాల అంతా వైరింగ్, ప్యాన్‌లు, ట్యూబ్‌లు, పెయింటింగ్, ఫ్లోరింగ్, 120 వరకు డ్యూయల్ డస్క్‌లు, ఆర్‌వో వాటర్ ప్లాంట్ మరమ్మతులు, పాఠశాలలో తాగునీటి కోసం ట్యాంక్ నిర్మాణం, అదనపు టాయ్‌లెట్స్ నిర్మాణం... ఇలా ఎన్నో పనులు చేపట్టారు. మరోవైపు పాఠశాలలో 20 తరగతి గదులు అదనంగా నిర్మిస్తున్నారు. ఇందులో ఫస్ట్ ఫ్లోర్‌లో 8 గదుల నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వచ్చాయి. 4 గదులు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. మరో 8 నిర్మాణ దశలో ఉన్నాయి.



నిర్మాణం పూర్తయిన అదనపు తరగతి గదులు



పాఠశాలలోని ఐఎఫ్‌పీ ప్యానల్



పాఠశాలలోని లైబ్రరీ

ఇవీ అదనపు సదుపాయాలు

- కంప్యూటర్ ల్యాబ్
- సువిశాలమైన లైబ్రరీ, సైన్స్ ల్యాబొరేటరీ
- ఆర్‌వో వాటర్ ప్లాంట్
- బాలబాలికలకు అల్లికలు, ఎన్‌సీసీ, గ్రీన్ క్రాప్స్‌లో శిక్షణతోపాటు టోఫెల్‌లో శిక్షణ ఇస్తున్నారు.
- బైజూస్ కంటెంట్‌తో బోధన.
- సీబీఎస్‌ఈ సిలబస్ పరిధిలోకి ఈ పాఠశాల మార్పు.

హైస్కూల్‌లో సమూల మార్పులు

పాఠశాలలో విద్యార్థులకు ఐఎఫ్‌పీ ప్యానల్స్‌తో బోధనతోపాటు సమూల మార్పులు వచ్చాయి. 'నాడు – నేడు' నిధులతో అదనపు తరగతి గదుల నిర్మాణం, ఇతర వసతులు సమకూరాయి. విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది.

– ఎం.రాజబాబు, ప్రధానోపాధ్యాయుడు, చంద్రంపాలెం హైస్కూల్

'నాడు - నేడు'తో అభివృద్ధి

ప్రభుత్వం 'నాడు – నేడు'తో అభివృద్ధి పనులు చేపట్టి పాఠశాలల్లో గొప్ప మార్పులు తీసుకొచ్చింది. ముఖ్యంగా డిజిటల్ బోర్డుల ఏర్పాటు చాలా గొప్ప ఆలోచన. ఒక్కో బోర్డుకు రు. 2 లక్షల వరకు ఖర్చు చేశారంటే చిన్న విషయం కాదు. మెరుగైన బోధన సాగుతోంది.

– ఎస్.స్వామి, ఉపాధ్యాయుడు, చంద్రంపాలెం హైస్కూల్.

సంక్షేమ సారథి సీఎం జగన్ మోహన్ రెడ్డి

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: అన్ని వర్గాల ప్రజల అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి అంతా అండగా ఉండాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం జీవీఎంసీ 7వ వార్డు మధురవాడ పోర్టు కాలనీలో మంగళవారం మధ్యాహ్నం నిర్వహించారు. ముందుగా క్లస్టర్ ఇన్‌చార్జి పోతిన శ్రీనివాసరావుతో కలిసి సంక్షేమ పథకాల ఫ్లెక్సీ, వైఎస్సార్ సీపీ పతాకం ఆవిష్కరించారు. అనంతరం ముత్తంశెట్టి మాట్లాడుతూ అన్ని వర్గాలకు మేలు చేసే సచివాలయ, వలంటీర్ వ్యవస్థ, ఇంటి వద్దకే రేషన్, పింఛన్ వంటి వాటితోపాటు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు, మహిళలకు సున్నా వడ్డీ, ఆసరా, అమ్మ ఒడి పథకాలు కొనసాగాలంటే సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డినే మళ్లీ సీఎం అయ్యేవిధంగా అంతా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు తమ్మినేని వరలక్ష్మి, పసుపులేటి గోపి, వాసు, సాంస్కృతిక విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ వంకాయల మారుతీ ప్రసాద్, సింహాచలం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, నాయకులు పిళ్లా సూరిబాబు, బంగారు ప్రకాశ్, చేకూరి రజని, పెంద్ర అప్పన్న, జగ్గుపల్లి నరేష్, డాక్టర్ సూర్యనారాయణ, పాపారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సంక్షేమ పాలనకు రోల్ మోడల్ సీఎం జగన్

పీఎం పాలెం: రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రజలకు లబ్ధి చేకూర్చిన ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాత్రమే అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు.'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం పీఎం పాలెంలోని 48వ నంబరు సచివాలయం పరిధి రామాలయం సమీపంలో మంగళవారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతిమయమైన గత టీడీపీ పాలనకు, పథకాల లబ్ధిని ప్రజల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్న ప్రస్తుత సీఎం జగన్ పాలనకు చాలా తేడా ఉందన్నారు. అనంతరం స్థానిక మహిళలు మాట్లాడుతూ పైసా ఖర్చు లేకుండా, లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేకుండా తమ పనులు పూర్తవుతున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. తామంతా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావును గెలిపించుకుని, మరోమారు జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకుంటామని పేర్కొన్నారు. ముందుగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించారు. సీనియర్ నాయకులు గాడె రోశిరెడ్డి, బొట్ట అప్పలరాజు, కె.వరలక్ష్మి, పోతిన మూర్తి, సూరిబాబు, వీవీ నరసింహారావు, అప్పారావు పాల్గొన్నారు.



మహిళలకు కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన మరలా రావాలని కార్పొరేటర్ లొడగల అప్పారావు అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం జీవీఎంసీ 8వ వార్డు వివేకానందనగర్‌లో మంగళవారం నిర్వహించారు. పేదల సంక్షేమం కోసం ఆలోచించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు గుడ్ల పోలిరెడ్డి, ఉప్పులూరి గోపి, అల్లాడ ఉమా మహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఫొటో చిరునామాల ప్రత్యేక పరిశీలన

భీమునిపట్నం: భీమిలి పరిధిలోని ఓటర్ల జాబితాల్లో ఒకే ఫొటో రెండుచోట్ల ఉండడంతోపాటు చిరునామాల్లో ఏమైనా తేడాలు ఉన్నాయేమోననే విషయాలను ప్రత్యేకంగా పరిశీలించే కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు ఆర్‌డీవో, నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి ఎస్.భాస్కరరెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం పలు రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితాల్లో ఒకరి ఫొటో రెండు చోట్ల రావడంతోపాటు చిరునామాల్లో తేడాలున్నాయని, వాటిని ఆయా బూత్‌ల స్థాయిలో పరిశీలిస్తామన్నారు. ఇందుకోసం బూత్ లెవల్ అధికారులు జాగ్రత్తగా తమ ప్రాంతాల్లోని జాబితాలను ఇంటింటికీ వెళ్లి పరిశీలిస్తారని, ఎక్కడైనా సమస్యలుంటే సరిచేస్తారని తెలిపారు. అలాగే ఈ నెల 19లోపు కొత్త ఓటర్లు తమ పేర్లు నమోదు చేసుకోవాలని, 25న జాబితా ప్రదర్శిస్తామని తెలిపారు. సమావేశం అనంతరం ఈవీఎంల పనితీరుపై నాయకులకు అవగాహన కల్పించారు. నాయకులు ముత్తంశెట్టి మహేష్, జీరు వెంకటరెడ్డి, గంటా నూకరాజు, డీఏఎన్ రాజు, కదిరి జగన్నాథం, చందరరావు పాల్గొన్నారు.



ఈవీఎంల పనితీరుపై అవగాహన కల్పిస్తున్న ఆర్‌డీవో భాస్కరరెడ్డి

అర్హతే ప్రామాణికంగా పథకాల మంజూరు

పద్మనాభం: అర్హతే ప్రామాణికంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నట్టు జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం మండలంలోని కోరాడలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలతో సంబంధం లేకుండా పథకాలు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, సర్పంచ్ కోరాడ లక్ష్మణరావు మాట్లాడుతూ కోరాడ సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాల కోసం రూ. 23 కోట్లు ప్రజలకు ఇచ్చినట్టు తెలిపారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండా, సంక్షేమ పథకాల ఫ్లెక్సీ ఆవిష్కరించారు. 'మా నమ్మకం నువ్వే జగన్' పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కోండ్రోతు శ్రీనివాసరావు, కోరాడ తాతినాయుడు, కోరాడ రామకృష్ణ, పాండ్రంగి రామకృష్ణ, చందక ఆనంద్, ఈవోఆర్డీ కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



'మా నమ్మకం నువ్వే జగన్' పుస్తకాలతో సుంకర గిరిబాబు, కోరాడ లక్ష్మణరావు

జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ

భీమునిపట్నం: ఇటీవల విశాఖలో డీసెంట్ ఫోటోకాన్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో భీమిలికి చెందిన షాడో వారియర్స్ కరాటే అసోసియేషన్ విద్యార్థులు ప్రతిభ చూపి పతకాలు సాధించారు. జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లోని కాటా, కుమిటీల్లో పాల్గొన్నారు. ఎస్.అభినవ్, పి.బెన్సన్, కోటి, శివ, గణేష్, జశ్వంత్, సుశాంక్, వరుణ్ కుమార్, నిక్షిత, చంద్రకౌశిక్, శివరాం, తేజశ్విన్ సాయి, సాయిచరణ్ తదితరులు బంగారు, వెండి పతకాలతోపాటు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారు. ఈ మేరకు మంగళవారం ఇక్కడి అసోసియేషన్ చీఫ్ కోచ్ ముగడ వెంకట రమణ యాదవ్, ఇతర సభ్యులు విద్యార్థులను అభినందించారు.



పతకాలు సాధించిన విద్యార్థులు

22 నుంచి టెన్నిస్ టోర్నమెంట్

తగరపువలస: చిట్టివలసలోని మెడోస్ స్పోర్ట్స్ విలేజ్‌లో ఈ నెల 22 నుంచి 24 వరకు డాక్టర్ కె.సుగుణాకరరావు మెమోరియల్ టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఇందులో పురుషుల 35 ప్లస్ సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో పోటీలు జరగనున్నాయి. సింగిల్స్‌లో విజేతకు రూ.10 వేలు, రన్నర్‌కు రూ.5 వేలు, డబుల్స్‌లో విన్నర్స్‌కు రూ.6 వేలు, రన్నర్స్‌కు రూ.4వేలు నగదు బహుమతులు ఇవ్వనున్నారు. పోటీల్లో పాల్గొనదలచే వారు ఈ నెల 21లోగా పీవీ లక్ష్మిని 94407 14190లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని టోర్నమెంట్ డైరెక్టర్ డాక్టర్ చల్లారపు శ్రీనివాసరావు తెలిపారు.

సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం




వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నాయకులు

ఆనందపురం : సమాజంలో అన్ని వర్గాలకూ సమన్యాయం జరగాలంటే మరలా వైఎస్ జగన్ మోహన్ రెడ్డినే ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వెల్లంకిలో మంగళవారం 'గడప గడపకు మన ప్రభుత్వం', 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ పాలనలో బడుగు బలహీన వర్గాల వారు అణచివేతకు గురయ్యారన్నారు. బీసీ, ఎస్సీలు, ఎస్టీలను కేవలం ఓటు బ్యాంక్‌గానే చూశారు తప్ప... వారి సంక్షేమానికి ఎటువంటి చర్యలూ తీసుకోలేదన్నారు. పదవులు, ఉపాధి, నామినేటెడ్ పోస్టులు... ఇలా అన్ని విషయాల్లోనూ వెనుకబడిన కులాల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యమిచ్చారని చెప్పారు. అన్ని ప్రాంతాల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మద్దతు తెలపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరించి, కరపత్రాలు అందజేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, నాయకులు పిన్నింటి వెంకటరమణ, కాకర వెంకట రమణ, కంచరాపు శ్రీనివాసరావు, కంఠిమహంతి చంద్రమౌళి, పడాల రాము, చెన్నా సత్యం, తోనంగి అప్పారావు రెడ్డి, కోరాడ అప్పలస్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

ఆనందపురం : మానవాళి మేలు కోరి ఏసు క్రీస్తు చేసిన బోధనలు అనుసరణీయమని పలువురు మత బోధకులు చెప్పారు. మండలంలోని వేములవలసలో సోమవారం రాత్రి ఐక్య క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజానికి మంచిని బోధించడం క్రీస్తు జననం ముఖ్య ఉద్దేశమని వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో గేయల్ ఇండియా గ్యాస్ సంస్థ చీఫ్ మేనేజరు ఎల్.సంజీవిరావు, కిరణ్ అబిదాస్, పాల్ విక్టర్, పాస్టర్ ప్రభుదాస్ ఆనందరావు, సర్పంచ్ కొండమ్మ, జంగం జోషి, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



ఐక్య క్రిస్మస్ వేడుకల్లో క్రైస్తవ సంఘాల ప్రతినిధులు


వైభవంగా లక్ష దీపోత్సవం

ఆనందపురం : హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని గంభీరంలో ఉన్న హరేకృష్ణ వైకుంఠం నిర్మాణ మందిరం ప్రదేశంలో లక్ష దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని రంగవల్లికలు వేసి అందులో దీపాలు ఉంచి దీపారాధన చేశారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రెసిడెంట్ నిష్కించిన భక్తదాస మాట్లాడుతూ కార్తీక మాసంలో శ్రీకృష్ణ భగవానుని ఆరాధిస్తే పాప ఫలితాల నుంచి విముక్తి పొందుతారని చెప్పారు. కృష్ణ భగవాన్‌కు నెయ్యి దీపం ఉత్తమమైనదని చెప్పారు.

సమస్యలు పరిష్కరించాలి

భీమునిపట్నం: అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, వర్కర్లు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ వద్ద మంగళవారం ఆందోళన చేశారు. ప్రమోషన్లు కల్పించాలని, సమస్యలు పరిష్కరించాలని కోరారు. పద్మావతి, శ్రీదేవి, గౌరి, ధనలక్ష్మి, శాంతి కుమారి, కనకదుర్గ పాల్గొన్నారు.

లేగ దూడల ప్రదర్శన



ప్రదర్శనలో లేగ దూడలను పరిశీలిస్తున్న జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గాడు వెంకటప్పడు

తగరపువలస: భీమిలి మండలం శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటలో మంగళవారం లేగ దూడల ప్రదర్శనను జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గాడు వెంకటప్పడు ప్రారంభించారు. ఈ ప్రదర్శనకు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన 50 మంది రైతులు తమ దూడలను తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వెంకటప్పడు మాట్లాడుతూ లేగ దూడలను శాస్త్రీయంగా పెంచితే భవిష్యత్‌లో పాలు ఇచ్చే ఆవులుగా మారుతాయన్నారు. వాటికి సరైన పోషకాలు అందించాలని సూచించారు. పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడు రామకృష్ణ మాట్లాడుతూ దూడ పుట్టిన పది రోజుల వరకు మందులు అందించి పాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గాడు వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.